ఆ వాడిన ఆకులు

-బుచ్చిబాబు

తెలుగు కథా రంగంలో బుచ్చిబాబుది విలక్షణమైన పాత్ర. కథలు రాసుకుపోతున్న రోజులలో వాటికి కొత్త హంగులు దిద్ది, స్వరూప స్వభావాలను మార్చిన శిల్పి బుచ్చిబాబు. "చైతన్య స్రవంతి"కి తెలుగు కథా రచనలో వొరవడి పెట్టిన మేధావి. బుచ్చిబాబు సాహిత్యం అన్ని శాఖలలో తన ముద్రను ప్రస్ఫుటంగా వేసుకున్నారు. మంచి చిత్రకారులు కూడా. కథలకు ఆయన పెట్టే పేర్లలో వొక ప్రత్యేకత వుంటుంది. బుచ్చిబాబు మాగ్నమ్ ఓపస్ "చివరకు మిగిలేది" నవల. పత్రిక పాఠకులకు నూతన సంవత్సర కానుకగా 1944లో బుచ్చిబాబు రాసిన యీ కథను అందిస్తున్నాం.

ఎందుకో ఆ గులాబీ మొక్కని చూసినప్పుడల్లా హృదయంలో వేళ్ళు పాతుకున్నట్లు సూర్యకాంతమ్మ శరీరంలో నరాలు కదలిక మానుకుంటాయి. ఆ మొక్కని చాలారోజుల కిందట ఆమె చెల్లెలి మొగుడు చంద్రకాంతం పంపించాడు. మొక్క వేళ్ళేమో పాతుకుంది కాని ఎదుగూ బొదుగూ లేదు. జాగ్రత్తగా పెంచినా లాభం లేకపోతోంది. ఆ మొక్క తాలూకు గులాబీని తల్లో పెట్టుకోడం కోసం చాలా రోజుల్నుంచి పూలు కొనడం కూడా మానేసింది. రాత్రంతా దాన్ని గురించే ఆలోచనలు, కలలు, సూర్యోదయం కోసం ఎదురుచూస్తూ, ఆలోచిస్తూ, ఆవులిస్తూ, భర్త గుర్రుని పరీక్షిస్తూ, నిద్రలేక మొహం వాపుతో, కళ్ల మత్తుతో దొడ్లోకొచ్చి, ఎంతెదిగిందో చూసేసరికి, అంతే వుంది- ఎదుగూ లేదు, బొదుగూ లేదు. రోజూ ఉదయం గంటసేపేనా దాని కోసం బాధపడడం ఆమెకు అలవాటై పోయింది. ఆ వాడిపోతూ, లేవలేకపోతూన్న లేత ఆకులు అతని నిద్రతో బరువెక్కి, బద్ధకించి వాలిపోయిన కనురెప్పలలోని స్థిరత్వాన్ని స్ఫురింపచేస్తూ ఎంతకాలం ఆమెని కలవరపెట్టడం?

"ఆ మొక్క పీకెయ్యించు. దానికేదో జాడ్యం పట్టింది. అది పాకిందంటే మిగతా మొక్కలు కూడా చస్తాయి తెలిసిందా? పంపినవాడు మంచివాడైతే అది నిక్షేపంలా ఎదుగును. మిగతావన్నీ బతకలా? నీ చెల్లెలి మొగుడు తాలూకు విషం దానికీ పట్టింది" అని రెండు మూడు సార్లన్నాడు ఆమె భర్త బసవయ్య. ఈ గుడ్డి నమ్మకాన్ని గెంటేసి శాస్త్రీయ సమ్మతమైన కారణం తెలుసుకోవాలని నవలలు చదవడం మాని, 'హార్టీ కల్చర్' గ్రంథాలు చదవడం మొదలెట్టింది. తోట్లోకి బసవయ్య చక్కా వొచ్చాడు. అతను బకాసురుడు లాంటి పెద్ద విగ్రహం. శరీరం ఆకారం లేని మాంసం ముద్దలకి చర్మం తొడిగినట్లుగా వుంటుంది. జుట్టుకీ కనుబొమ్మలకీ మధ్య సరిహద్దులాగ కాస్తంత నుదురు. కనుబొమ్మలు ఫొదలా ఎదిగి చెవులదాకా పాకినట్లుంటాయి. కందిరీగ కుట్టినట్లుగా కుడికంటి కింద వాపు. తేనెటీగల పట్టుమాదిరి అర్థం లేని వొంకరలు తిరిగి వృథాగా అల్లుకున్న క్రాపింగు. గాలికి వూగులాడే ముసిలివృక్షం కొమ్మలలాంటి చేతులు. నవ్వినప్పుడు నవ్వునే వెక్కిరించే వెడల్పు పెదవుల వెనక ఐక్యతలేని పళ్ళవరస. ఇంటర్ కాగానే, భార్యలాగే చదువు చాలించి 'ఇన్‌సూరెన్స్' ప్రపంచంలో కృషి చేసినందుకు అధికారులు మెచ్చుకుని, తుదకి మేనేజర్ పదవి- దాంతో పాటు కారూ యిచ్చారు. ఆ కారుకి సరిపడ్డ నిండైన విగ్రహం.

"ఈ మొక్క యింకా పీకలా? దీనికేదో పురుగట్టింది. మీ చెల్లెలి మొగుడిలో కుళ్లు దీనికీ పట్టుకుంది."

ఇట్లా చంద్రకాంతంపై భర్త ద్వేషం ప్రకటించటం ఆమెకు మొదటిమాటు కాదు. అతనితో ఎప్పుడో పెళ్ళిలో తప్ప, బసవయ్యకి పరిచయం కూడా లేదు. లేమివల్ల జనించిన అసూయ బురదలా ఎక్కడపడితే అక్కడే వుంటుంది. భర్త ద్వేషానికి అసూయ కారణం అవడానికి అవకాశాలు లేవు. చంద్రకాంతం గొప్ప హోదాలో లేడు; అతని కసలు ఉద్యోగమే లేదు; అతనంత ఆస్తిపరుడూ కాడు; గొప్ప పండితుడూ కాడు- వొందల మంది మాదిరి అతనూ వో గ్రాడ్యుయేట్; కాంగ్రెస్‌లో పావలా మెంబరు కూడా కాడు. మరెందుకు ద్వేషం? భర్త మనస్సు కాంతానికి అర్థం కాలేదు.

"ఎప్పుడూ చెల్లెలి మొగుడేనా? మీకు తోడల్లుడన్న విషయం మరచిపోకండి. పాపం, అతనేం చేశాడు? వాళ్ళ వూర్నుంచి ఎవరో వస్తే యీ పూలమొక్కని మా చెల్లెలితో

ఆణిముత్యాలు

చెప్పి పంపించాడు." అంది సమర్థిస్తూ. కాంతం బ్రహ్మచారి గుండెలో తుపాను లేవగొట్టేటంతటి చక్కంది కాదుగాని, మాట్లాడేటప్పుడు ఆకర్షణీయంగా వుంటుంది. చాయనలుపే- పూర్ణిమ నాటి మెత్తటి, మెరిసిపొయ్యే నలుపు. మాటలతో ప్రకటించలేని భావాలని పెద్ద కళ్ళ కదలికలో చూపిస్తుంది. 'ప', 'వ', 'ఎం' మొదలైన గొంతు ముందు భాగంలోంచి వొచ్చే అక్షరాలని వుచ్చరించినప్పుడు పెదవులు కొత్త పొందికను తెచ్చుకుంటాయి. మాట్లాడినప్పుడే ముక్కు పక్కని గీత బుగ్గని కెరటంలా లేవదీసి, తెరచాప చుక్కానీ లాగ పెదవులకీ, బుగ్గకీ లయ కల్పుతుంది! మొహంలోని అమాయకత్వానికి నాజూకైన బట్ట, వేషధారణ కొంత కుటిలత్వం కల్పిస్తాయి. 'ప్రీమియమ్‌లు', 'బోనస్సులు', 'డివిడెండ్లు'- యీ లోకంలోంచి భర్తని విముక్తి చేసే శక్తి గులాబీ మొక్కకి వుందని ఆమెకి తెలుసు. అదీ కొంత మెరుగే.

"తోడల్లుడని చెప్పుకోటం నాకు సిగ్గుగా వుంది. ఏదేనా ఉద్యోగంలో ప్రవేశించరాదూ?"

"లా, కెడతాడుట ఏదీ- మొన్ననేగా బి.ఎ. పూర్తి చేసింది? అందరికీ పుట్టగానే ఉద్యోగాలొస్తాయా?"

"లా కాదు, బల్ల. నా ఆఫీసులో గుమాస్తా పని కోసం లక్ష మంది గ్రాడ్యుయేట్లు సిద్ధంగా వున్నారు. వీళ్ళంతా దేశానికి బరువు చేటు."

"అతని ఉద్యోగం సంగతి మనకెందుకు లెద్దురూ? వాళ్ళ తంటాలు వాళ్ళు పడతారు" అంది కాంతం. చంద్రకాంతాన్ని గురించి భర్త మాట్లాడడం తనకి కొంత సంతోషం యివ్వకపోలేదు. ఇన్‌స్యూరెన్సు డబ్బా మోతకంటె బోలెడు నయం. ఉద్యోగంలో పడ్డ తర్వాత మొగాడికి ఆ ఉద్యోగం గొడవే. చంద్రకాంతం లాంటి నిరుద్యోగి ప్రపంచానికి అధికారి. వాళ్ళకి ప్రవర్తనా స్వేచ్ఛ, మానసిక వైశాల్యం వున్నాయి.

"మనకెందుకేమిటి?- మనకే. ఫలానా ఆయన తోడల్లుడు నందులమ్మట తిరుగుతున్నాడంటే. నాకే నామర్దా. ఊరికే పగలంతా ఊరమ్మటా, రాత్రంతా సినిమాల చుట్టూ తిరిగి, వున్న రెండెకరాలూ సిగరెట్ల ద్వారా ఊదెయ్యడం బదులు నన్నడిగితే ఏదో తంటాలు పడి 'ఖాళీ' చెయ్యిస్తాను. నా ఆఫీసులో గుమాస్తాగా చేరడం మంచిదంటాను."

"ఇప్పుడు మిమ్మల్ని ఎవ్వరూ అడగలేదు. వెళ్ళండి, ఎవరో వొచ్చినట్లున్నారు"- అంతటి మనిషినీ తన గుప్పెట్లో వుంచుకుని, గాలిలో వూదెయ్యగలనని కాంతానికి తెలుసు. ఆ నమ్మకం ఆమెలోని ఆకస్మిక చైతన్యానికి, మార్పులకి కారణం.

భర్త బైటికెళ్ళిన కారు చప్పుడైంది. కాంతమ్మ లోపలికొచ్చి హార్టీకల్చర్ పుస్తకం బీరువామీద గిరవాటేసి, చెల్లెలి పెళ్ళి ఫోటో ముందు పెట్టుకుని కూచుంది. అందులో భర్త లేడు. ఆ కారణం చేతనే దాన్ని చూడడానికి యిష్టపడొచ్చు. అల్లా అనిపించినందుకు నీరసంగా నవ్వుకొంది. ఈ చంద్రకాంతంలో భర్త ద్వేషించేటంతటి విశేషం యేముందో తెలుసుకోవాలనుకుంది. పెళ్ళినాడే అతన్ని గురించి అంతా చిత్రంగా చెప్పుకున్నారు; తనూ ఎన్నో విందె; చెల్లెలికి ఏమీ తెలీదు, అమాయకురాలు. అడిగితే ఏమీ తెలీదంటుంది. ఈ గాథల పుట్టుపూర్వోత్తరాలు భావికాలంలో మరుగుపడ్డాయి. వాటిని తవ్వి చూపేందుకు ఎవ్వరూ- భర్త కూడా సాహసించలేదు. ఈ గాథల సారాంశం ఏమిటి? అతను తుంటరి; చెడ్డవాడు; స్త్రీలోలుడు; నైతిక నియమాలు లేవు; సంఘ కట్టుబాట్లు, బాధ్యత మొదలే లేవు; రోగాల పుట్ట; మహాపాపి. వీటికి తార్కాణం అతను నిరుద్యోగి కావడమే. ఇవేవీ ఆమె అతనిలో చూడలేదు. ఆరోగ్యమంతా అతని మొహంలోని వెలుగులోనే వుంది. అతని ముందు నిలబడ్డ కాసేపూ వాతావరణం చీకటై మైమరుస్తారు. అతని ముందు నిలబడ్డ కాసేపూ వాతావరణం చీకటై మైమరుస్తారు. బుర్రపని చెయ్యదు. అతనితో చెప్పేటందుకు మాటలు కనిపించవు. కుట్ర, కల్మషం, నీతి, సంఘం, మతం- అన్నీ వాటి నిరంతర యుద్ధాలని ముగించి, శాంతి కోసం తడుములాడి, అతని నేత్రాలలో ఐక్యం అవుతాయి. అతను మితభాషి. గుర్రం పిల్లలోని శక్తి చాంచల్యం, మూగబలం- అన్నీ అతనిలో చూడగలిగింది. ఏవో పుస్తకాలు చదువుకునేవాడు; ఏవో బొమ్మలు గీసుకునేవాడు. సైకిలుమీద వెళ్ళి రాత్రి పదింటికొచ్చేవాడు- అత్తారింట్లో. దరఖాస్తు పెట్టమంటే,

నవ్వి సరే అనేవాడు కాని పెట్టేవాడు కాడు. తనకి తెలియకుండా అతన్ని ఆదర్శ పురుషుడుగా ఎంచుకుంది కాంతం. వెనక, ఆమె చెల్లెలు ఏదో బొమ్మ తీసుకొచ్చి "బాగుందా, మా ఆయన వ్రాశాడు" అంది. ఆ బొమ్మ తనదేనని తెలుసుకుంది, నమ్మింది. "ఎవరే యీ బొమ్మ?" "నాదే" అంది చెల్లెలు. పిచ్చిది. వెర్రిబాగుల్ది. ఎప్పుడో, ఎక్కడో తనకీ, అతనికీ మూగ బాంధవ్యం కుదిరి వుంటుంది. అతన్ని అర్థం చేసుకుంది. అర్థం చేసుకొన్నవాళ్ళే అనుభవించడానికి అర్హులు.

భర్త అతన్ని గురించి చూపిన అసూయలోనూ, ద్వేషంలోనూ హేళన భావం, తాత్కాలిక హాస్యం పైకి వున్నా, వాటి వెనక నిజమైన వుద్రేకం, 'కసి' వుంది. దానికి కారణం ఏమిటి? ఈ ఆలోచనలు ఆమెను బాధిస్తున్నా ఆ బాధలో ఆనందం కూడా వుంది. కాని దానికి ఆకారం లేదు, పరిపూర్ణత లేదు. ఎవళ్ళకీ చెప్పుకోడానికీ లేదు. అవి ఏకాంతాన్ని కోరతాయి; రహస్యాన్ని కాపాడతాయి. ఎంతకాలం యీ చీకటి, రహస్యం? ఆ మొహం ఆమెని పదేపదే కలవర పెట్టడానికి కారణం ఆమె దాని నిజాన్ని గురించి నిర్ధారణకు రాకపోవడం. ఏదో ఓ నిముషం అనుకోడం, దాన్ని తోసెయ్యడం, బలవంతంగా మరచిపోవడం, అది మళ్ళా గంటలోనే వొత్తిడి కలిగించడం, సగం సగం సాగించిన ఆలోచనా, నిర్ధారణకు రాని కార్యం- యివి మనుష్యులని పీడించుకు తింటాయి. ఇందులో నించి బైటపడాలంటే బాధించే విషయాన్ని పూర్తిగా వొకేసారి బ్రద్దలు కొట్టడం వొక్కటే సాధనం. ఆ ఫోటోలోని మొహాన్ని బాగా పరీక్షించింది. దానిలోని లోపాలు, చెడ్డ లక్షణాలు ఏరి వల్లె వేస్తే అతని ప్రతిమ వొత్తిడి కలిగించదు. గడ్డం బాగాలేదు. బుజాలు బాగాలేవు. చెవులేం బాగున్నాయి? మీసాలు తీసేసి- ఆడదాని లాగా- అసలు బాగలేడు. ఇది నిజం, దీన్నే గుండెకు నొక్కి, నిబ్బరం చేసుకోవాలి. కాంతం నిట్టూర్పు విడిచింది- ఎడారి లాగ మారింది మనస్సు. ఫోటో గోడకి తగిల్చి, గూట్లోనించి హక్స్లీ రాసిన "ఆ వాడిన ఆకులు" అన్న నవల తీసింది. మళ్ళా ఆకులు, వాడిపోవడం... తన మీద కోపం వచ్చింది. బైట సాయిబు 'గులాబీ పువ్వులో' అని కేక వేస్తూ అమ్ముకుంటూ పోతున్నాడు. పుస్తకం గిరవాటెట్టి తలుపు తీసి, మళ్ళా చప్పుడయ్యేటట్లు మూసింది. మళ్ళా ఆమె మనస్సు ప్రాచీన శక్తుల వైషమ్యాలకి నిలయం ఐపోయింది.

☆☆☆

చంద్రకాంతం భార్యని ఆస్పత్రిలో పరీక్ష చేయించడం కోసం విశాఖపట్నం రావాల్సి వచ్చింది. అక్క గారింట్లో దిగుదామని అతన్ని భార్య చంపుకుతింది. సంఘంలో తనకి స్థానం స్థిరపడేంత వరకూ బంధువులూ, మిత్రులూ లేరని అతనెంత చెప్పినా ఆమె వినిపించుకోలేదు. పైగా ఆ ఊరొస్తున్నారని తెలియగానే బసవయ్య తప్పకుండా వాళ్ళింట్లోనే దిగాలని ఉత్తరం వ్రాసి, వొచ్చే సమయం తెలుసుకుని స్టేషనుకి కారు కూడా పంపించాడు.

భార్యని ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత అతను రోజంతా అక్కడే గడిపేవాడు. డాక్టరు రోజుకి నాలుగు గంటలు మాత్రం భార్య దగ్గర వుండేందుకు వొప్పుకున్నా, ఎల్లాగో అక్కడే గడిపేసి, సాయంత్రం బీచివొడ్డున తిరిగి, క్లబ్బులో చీట్లాడి, రాత్రి పది గంటలకి యింటికి చేరుకునేవాడు. అతనికి మేడమీద మారుమూల గది ఇచ్చారు. భోజనాల దగ్గర మాత్రం అందరూ ఆస్పత్రి సంగతులు మాట్లాడుకునేవారు. భోజనం కాగానే బసవయ్య కారుమీద వెళ్ళిపోతూ, చంద్రకాంతాన్ని ఆస్పత్రి దగ్గర దించేవాడు. ఇట్లా ఐదు రోజులు గడిచాయి.

కాఫీ తీసుకుని మేడమీద గదిలో కొచ్చింది కాంతం. చంద్రకాంతం మంచం మీద నుంచి తటాలున లేచి కుర్చీలో కూర్చున్నాడు. తెల్లటి పైజమా, కంటిమెడ చొక్కా, పెద్ద తువ్వాలూ, చిందర వందర జుట్టూ- అప్పుడే కమ్యూనిష్టుల సమావేశం నుంచి వొచ్చినవాడిలా వున్నాడు.

కాఫీ కప్పు బల్లపైన పెట్టింది. అతనేమీ మాట్లాడలేదు. సిగరెట్ ఆర్పేందుకు 'ఆష్ ట్రే' కనిపించక అటూ, ఇటూ చూస్తున్నాడు. కాంతం తలవొంచింది. గుమ్మంలోంచి గిరవాటెట్టాడు.

"కాఫీకి ముందే కాల్చాలా ఆ వెధవ సిగరెట్టు!"

అతని పెదవులకేసి చూసింది. సిగరెట్లు కాల్చకుండా వుంటే అవి నిజంగా గులాబీ రేఖలలా వుండుననుకుంది.

"సిగరెట్టు నా పాలిటి దైవం, అది లేకపోతే నాగరిక ప్రపంచంలో క్షణం బ్రతకలేం-"

"ఎందువల్ల?"

"పొగ, దుమ్ము, క్లోరోఫారం, తారువాసన- నేటి లోకం వేగంతో సమంగా వెళ్లలేక క్రుంగిపోతున్న నరాలకి జీవం పోసే నిప్పుకణం."

"సరే- యివన్నీ నీ వొక్కడికేనా యేమిటి? మావారు కాల్చరేం?"

కాఫీ చప్పరిస్తూ ఆమెకేసి కోలగా చూశాడు.

"మీ ఆయన మహానుభావుడు, మా నవీనత్వం అనే జబ్బు తగల్లేదింకా. అతనికి సమస్యలు లేవు. సందేహాలు లేవు. నోరులేని బాధలూ లేవు. సంసారం, హోదా, సంఘంలో స్థానం, మంచి పెళ్ళాం, కారు, ముఖ్యంగా డబ్బూ- అన్నీ వున్నాయి. అవి నాకు లేవు కాబట్టి, సిగరెట్టుతో తృప్తిపడతా-"

కాంతాని కిట్లాంటి మాటలు విని చాలా కాలమైంది. ఎప్పుడో కాలేజీలో ఉపన్యాసకుడి ద్వారా వింది. 'పంచి పెళ్ళాం' అనడంలో తను పెళ్ళాంగా మంచిదో- వ్యక్తిగా కోరదగిందో అతని తాత్పర్యం బోధపడలేదు ఆమెకి.

"మా చెల్లెలు మంచి పెళ్ళాం కాదూ?"

"మొగుడు మంచివాడైతేనే పెండ్లాం మంచితనం లెక్కలో కొస్తుంది."

క్షవర దుకాణం చాప మీద పరిచాడు.

"మానవీనత్వానికివన్నీ వుపకరాలు"- కాంతం వెళ్లి గ్లాసుతో నీళ్ళు తెచ్చింది.

"మీకెందుకీ శ్రమ? బంట్రోతు తెచ్చునుగా"...

"చంద్రం! నన్ను 'మీ' రనడం దేనికి?"

"ఒదినగారు- అందులో చదువుకున్న వారు?"...

"చాల్లే- నీదంతా చిత్రం. ఐతే నీ నవీనత్వంలోకి నేను వస్తానా?"

"మీరట్లా అడిగితే చెప్పలేను. నవీనత్వానికి లక్షణాలు చెబుతాను, అందులో వున్నారో లేరో మీరే చూసుకోండి. మొదటిది- ఫలాన పనీ అని వుండగూడదు. ఏ వొక్కదాంటోనూ సంపూర్ణమైన పాండిత్యం వుండగూడదు. మతం, దైవభక్తి అసలు పనికిరావు. సంప్రదాయాలు, ఆచారాలు, పెద్దలు, ఆధ్యాత్మిక పిచ్చి- వీళ్లు మాకు శత్రువులు. చరిత్రను చింపి పోరేశాము. పొందిన వస్తువుతో తృప్తిపడగూడదు, అనుభవించగూడదు. మార్పు మా మతం. ఈనాడున్న ఆదర్శాలు రేపుండవు. జీవితపు విలువలు లేవు. ఏదో ఆశిస్తాం- అదేమిటో నొక్కి చెప్పలేం. ఏదో బాధపడతాం; అదెవ్వరికీ అర్థం కాకూడదు. తొందర, తమాషా, తారుమారు, తాత్కాలిక తన్మయత..."

కాంతం ఆవలించింది. నవ్వింది. ఇది సిద్ధం చేసిన ఉపన్యాసంలా వుంది కాని, సహజమైన వాక్కా! అతని తెలివిని, చమత్కారాన్ని తను ప్రదర్శించాలని యత్నిస్తున్నాడా? అట్లా యత్నించడంలో వుద్దేశం? ఏదో ఆమెలో కొత్త ఆశ వుద్భవించింది. ఈ ఆశా భవనానికి పునాదుల నిర్మాణం ప్రారంభించాలి. ఏం చెయ్యాలో ఆలోచించడానికి దిగి వెళ్లిపోయింది. అతను భోజనం కాగానే వెళ్లిపోయి, మళ్ళీ రాత్రి భర్త వొచ్చిం తర్వాత కాని రాలేదు.

మొన్నాడు ఉదయానే లేచి బసవయ్య రాత్రికి రానని చెప్పి వెళ్లిపోయాడు. కాంతం ఏడింటికి కాఫీ కప్పుతో మేడ మీది గదికి వెళ్లింది. అప్పుడే స్నానం చేసిన తడి ఆ తెల్ల సిల్కు చీరలోంచి చల్లదనాన్ని వెదజల్లుతోంది, సూర్యకాంతి మధ్య పాపిడి గుండా నుదుటమీద గీతలా పడింది. ఆకలి, సంతృప్తి- రెండూ ఆ బాల్యపు సౌందర్యం మొయ్యలేని శక్తితో కళ్ల ద్వారా కలత కనపరుస్తున్నాయి. ముడుచుకున్న పెదవుల మరుగులో సంకల్పం వుంది.

"ఎప్పుడు తీసుకొస్తావు మా చెల్లెలిని?"

"రేపే- ఏమీ భయపడవలసిన జబ్బు కాదన్నారు డాక్టర్లు."

"నువ్వింకా లేవలేదేం?"

అతను మంచం మీదే వోరగా కూర్చుని దిండ్ల మీద మోచెయ్యి ఆనించాడు. నిద్రలేక బరువెక్కిన కళ్ళు, యాత్రసాగించి, మోసపోయి, విరామం పొందిన మొహవర్చస్సు- అతను వ్యాధిగ్రస్తుడు.

"నాకివాళ వొంట్లో ఏమీ బాగలేదు."

"అయ్యో పాపం! హాస్పిటల్‌కి నే వెళ్లి చూసొస్తాలే... ఏం, తలనొప్పా?"

దగ్గరగా వొచ్చింది. మంచం బద్దీ మీద ఆనింది.

"ఫలానా అని చెప్పలేను. మగతగా వుంది- తిండి మాన్తే అదే పోతుంది లెండి."

కాస్సేపు నిశ్శబ్దం.

"ఆ కుర్చీ మీద కూర్చోండి. మీరల్లా నిలబడ్డం నాకిష్టం లేదు" అన్నాడు. నీరసంగా కూర్చొంది. పాదాలపైకి లేచిన చీర కుచ్చిళ్లను కిందకి లాగింది. చెంపమీద చెయ్యేసుకుని అతని కళ్లలోకి దీర్ఘంగా చూసింది. అదిరిపాటుతో అతను దృష్టిని

విజ్ఞప్తి!

హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన భూమికపై పరిశోధన చేస్తున్నాము. ఈ అంశానికి సంబంధించిన వ్యక్తులు, ప్రచురిత వుస్తకాలు, ఫోటోలు యితరత్రా ఎటువంటి సమాచారమున్నా దయచేసి ఈ క్రింది చిరునామాకు అందజేసి, సహకరించవలసిందిగా మనవి చేస్తున్నాం.
సయ్యద్ కె., ఇం.నెం. 5-5-72, కంకర్‌బోడ్, మహబూబాబాద్-506 101, వరంగల్ జిల్లా.

మరల్చుకున్నాడు.

"ఐతే చంద్రం... ఆ చెల్లెలు ఒక బొమ్మ చూపించింది. అది నాదే... నేను వెయ్యిదగ్గ- అబ్బ! ఎల్లా అనాలో రావడం లేదు- వేసేటందుకు- కాదు- నేనంతటి- బాగా వున్నానా?" సిగ్గుతో కనురెప్పలు వాల్చింది. అతను నవ్వాడు.

"అదా- అది మీది కాదు. మీ చెల్లెల్ది వేద్దామనుకుంటే అట్లా తయారైంది."

"నువ్వు ఏ వుద్దేశంతో వేస్తే అల్లా తయారైందో."

"చెప్పాగా నా కుద్దేశాలూ, అభిప్రాయాలూ లేవని..."

"కాదు. నాదే వేద్దామని సంకల్పించావు."

"కావొచ్చు. నాకు తెలీకుండా నా అంతరంగం అనేక పన్లు చెయ్యిస్తుంది. వాటిలో యిదీ వొకటి కావొచ్చు."

"నీ ఆంతరంగికంలో అప్పుడు నే వుండి వుండొచ్చు..."

"సుప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్త ఫ్రాయిడ్ గారి శిష్యురాలిలా వున్నారు."

"నాకు గులాబీ మొక్కను పంపించావు. ఈ రెండూ కూడితే ఏం తేల్తోంది?" అని ప్రశ్నార్థకంగా చూసింది.

"విషమ పరీక్ష. డాక్టర్ వాట్‌సన్‌గారి నడగాలి... బొమ్మ నా సృష్టి, గులాబీ ప్రకృతి సృష్టి."

"ఈ రెండూ నన్ను గురించి... నాచే ఆకర్షింపబడ్డ సృష్టి..."

అతను పక్కకి తిరిగి సిగరెట్టు ముట్టించాడు. ఇదంతా నిజమై వుండవచ్చుననన్నట్టుగా తెల్లబొయ్యాడు. నీరసంతో మూలుగుతూ దిండు మీద తల ఆనించాడు.

"చంద్రం, నా కెందుకో తెలుసా యింత దిగులు?... నువ్విచ్చిన గులాబీ మొక్క వాడిపోతోంది. అది యెదగడం లేదు. మొగ్గ వెయ్యడం లేదు... దానికేసి చూస్తే నువ్వే జ్ఞాపకాని కొస్తావు. నీ వూర్వవు చరిత్ర వాడిపోయినట్లుగా... ఎంతో మంది నీకు నీళ్ళు పోశారు; దువ్వారు; లాగారు- లాలించారు... వాడిపొయ్యావు... నాకు దాన్నీ, నిన్నూ బతికించాలని..."

అతను భయంతో కళ్ళు పెద్దవి చేశాడు. ఆమె లేచి అతని దగ్గరగా వెళ్లి నుదుటి మీద చెయ్యేసింది. అది కాలిపోతోంది. నిమిరింది.

"ఆ మొక్క ఎందుకు పుష్పించదో చెప్పవూ?"

"కొన్ని కొన్ని గులాబీలు నీళ్లతో పుయ్యవు... దాన్ని రక్తంతో పెంచాలి...'

ఆమె వేళ్ళు అతని జుట్టులో దాచుకుంది. అతను వాటిని తొలగించాడు.

"మీరిట్లా చేస్తే మీ నౌకరీ పోతుంది..."

"నాకేం నౌకరీ?"

"భార్యగా వుండడం. హిందూ లా ప్రకారం వొకసారి స్త్రీని వుద్యోగం లోంచి తొలగించిన తర్వాత మళ్ళా ఎవ్వడూ కుదుర్చుకోడానికి వీల్లేదు. ఆ మొదటి యజమాని బ్రతికి వున్నంత వరకూ."

"నౌకరీ పొట్ట కోసం. కాని హృదయం, ఆత్మ?"

"అవి మాకు లేవు. బిహేవియరిస్టు వాట్‌సన్ దొరగార్ని అడగండి. శరీరం ప్రమాదం నుంచి కాపాడుకునేందుకు వాటిని కల్పించుకుంది."

"నాకుంది."

"అది వున్న వాడినే చూసుకోండి. మీ భర్త గారికి చాలా విశాలమైన హృదయం వుండి వుంటుంది- శరీరంలాగే."

కాంతానికి కోపం వచ్చింది. భర్తంటే యితనికీ అసూయ; ద్వేషం. పురుషులందరూ అంతే. ఎందుకో, కాని ఆ అసూయకు కారణం తను కాదు.

"కాదు చంద్రం- నీకు హృదయం వుందనుకున్నాను. నిన్ను నేను అర్థం చేసుకున్నాను."

"అది భ్రమ. అర్థం చేసుకునేందుకు నాలో ఏమన్నా మహత్తర రహస్యం వుంటేగా. మాకు హృదయాలు లేవు- బుర్రలున్నాయి. శరీరాలున్నాయి. బుద్ధి వుంది, జ్ఞానం లేదు. పావలోవ్ (Pavlov)ని అడిగితే అదీ లేదంటాడు. మేం అంతర్జాతీయ అజ్ఞాత వాసులం; రాజకీయ జంతువులం; ఆర్థిక పశువులం; సారస్వత చిలకలం; చరిత్రాత్మక గబ్బిలాలం; మరమనుషులం. నేను పెట్రోలు వాసన, సిగరెట్ పొగ, ఫ్యాక్టరీ రొద, ఐడోఫారం కంపు- నీ యిష్టం, మానవుణ్ణి మాత్రం కాను..."

ఇదంతా ప్రగల్భంగా, వంచింపుగా తోచింది ఆమెకు. మరో రాయి విసిరింది: "ఇవన్నీ నువ్వు కావొచ్చు. మరి నేను... నా ప్రేమ..."

"అవి భాషకి సంబంధించిన సమస్యలు. రిచర్డ్స్ (Richards), ఆగ్డన్ (Ogden) దొరగార్ల నడగాలి. ఆ మాటల్లో ఎంత యదార్థం వుందో, ఎంత విలువ వుందో, ఎంత పరిణామం వుందో నాకు తెలీదు."

"నా సౌందర్యం."

అతను లేచి కూర్చుని ఆమెకేసి తీవ్రంగా చూశాడు.

"మేం సౌందర్యానికి చలించం. దాన్ని పూర్వీకులు వర్ణించి వర్ణించి దుంప తెంచారు. నిజంగా చూసేప్పటికి దాన్లో కొత్తదనం పోయింది. నేను ప్రేమించడం మరిచిపోయి చాలా కాలమైంది. హెలెన్, అనార్కలీ, క్లియోపాట్రా, శకుంతలా, గార్బోలాయ్- వీళ్ళే మా కలలని బాధిస్తారు...

కాంతానికి కోపం మరింత యెక్కువైంది. ఇవన్నీ నిజంగా అన్నవో, పరిహాసానికో తనకర్థం గాలేదు. ఈ పిచ్చి ధోరణిని బట్టే, అంతా యితన్ని గురించి అట్లా అనుకుంటారనుకుంది, అతనితో వాదించింది, బ్రతిమిలాడింది. జరిగిపోయిన సంగతులు తవ్వింది. అతను కత్తిమీద హాయిగా నడవసాగాడు. ఉడుకులోన్ సీసా కోసం కింది కెళ్ళింది. తెచ్చి గుడ్డమీద పోసి నుదుటిమీద వుంచింది.

"నన్ను మీరిట్లా తాకడం దారుణం. అందులో బాధలున్నాయి."

"నీకిట్లాంటి అనుభవం లేనట్టు మహా!"

"లేక కాదు, అవి వేరు. అవి ఎూణ్ణాళ్ళ ముచ్చటకాదు. పిల్లలు లేని స్త్రీ నాతో కాలక్షేపం చెయ్యడం కాదు, సంస్థల్ని వెక్కిరించడం గాదు. మా పిచ్చిలో కూడా కొంత తర్కం, మార్గం లేకపోలేదు. మీ విషయం వేరు. ఇదొక ఎంట- జ్వాల. వేళ్ళు పెడితే ఎండి, భస్మమైపోతాను. పాపానికి వేతనం మృత్యువు. నాకు కొంత కాలం బతికి సూర్యోదయాన్ని చూస్తూ ప్రేమతో వొణికి పోవాలనుంది."

పక్కకి తిరిగి మూలగడం మొదలెట్టాడు. చారు కాచి తీసుకొస్తానని వెళ్ళిపోయింది కాంతం.

☆☆☆

మధ్యాహ్నం మూడు గంటలైంది. ఓవల్టీన్ పట్టుకుని కాంతం మేడమీది కొచ్చింది. అతను నిద్రపోతున్నాడు. కళ్ళకింద తడి కనిపించింది. ఉడుకులోనుదో- అనురాగానిదో తెలీదు. హెలెన్, క్లియోపాట్రా, శకుంతల ఆమెను వీడించుకుతిన్నారు. ఏదో చెయ్యమని పురికొల్పారు. నిద్రలో వున్న శరీరానికీ, బుర్రకీ మహత్తరమైన యెడబాటు. గాలిలేని ప్రకృతి మాదిరి నిశ్చల సౌందర్యాన్ని ప్రకటించుకుంటుంది. యుగాలనాటి కొండ శిఖరాలు, సెలయేళ్ళు, భూమిలో మరుగుపడ్డ మానవుడి ఎముకలు, వేళ్ళు పాతుకుని పుష్పించలేని గులాబీ మొక్క- కాంతాన్ని ఐక్యతకి రగిల్చాయి. సంసార

నీ కోసం

నీ పెదవులపై నవ్వు చూసి ఎన్నాళ్ళయింది
నీ లేత గులాబీ చెక్కిళ్ళను చిదిమి
అల్లరిగా నవ్వి ఎన్నేళ్ళయింది..!
చంద్రబింబంలాంటి నీ వదనంపై
తారట్లాడే మబ్బు ముంగురుల్ని సవరించి ఎంత కాలమైంది!
నీ కోసం నా నరాలను వీణ చేసింది ఏనాడో!
నా హృదయంపై నిన్ను నిద్రబుచ్చే అలవాటు
మానుకుందేనాడో!
నాకిష్టమైన ఆకాశం రంగు శిల్కు చీర
నువ్విప్పుడైనా కట్టుకుంటే
నీ కళ్ళలోకి ఆకాశమంత లోతుగా
చూడకుండా ఎలా ఉండగలను!
షికారుకి పోదామంటే సున్నితంగా వారించే
నీ కనురెప్పలపై కావ్యాలిప్పటికీ
రాసుకుంటూనే ఉన్నా!
వంటింటి పరిమళాలన్నీ నీ వంటిపై అద్దుకుంటూ
ఆకలేసినా... దెబ్బ తగిలినా...
అమృతనాన్ని ఆవిష్కరించుకొని
సూర్యచంద్ర సురుచిర సయనాలతో
భూగోళాన్ని పాలించే ఆదిశక్తిని నీలో చూశా.
నీ కనుసన్నల్లో ఓనమాలు నేర్చిన పాపాయిని
నా అడుగుల్లో నడిచే నీ పాదాలకు
తొడుక్కున్న త్యాగాల చెప్పులకి నమస్కరిస్తూ
తుపానుల తీరాలు దాటుకుంటూ
నీ మాటల్లో నా బాల్యాన్ని అందుకుంటున్నా
నీ చీర కొంగుకి నన్ను నేను ముడేసుకున్నా.
మా అమ్మే నాకోసం నీలా పుట్టిందనుకున్నా.
ఇప్పుడు నేను ప్రేమించేది
మా కోసం మౌనంగా కరిగించుకున్న నీ కర్పూర జీవితాన్ని
వదులుగా నీ చేతికి వేలాడే గాజుల్ని సవరించితే
చెక్కు చెదరని ఎన జ్ఞాపకాల విరజాజులు
గుప్పుమన్నాయి
దోసిలి నిండా నీ వలపు పాటల్ని తాగినందుకేనేమో
నా నిలువెల్లా నేటికీ వెలుగు తీగలు విరబూస్తూనే ఉన్నాయి
ఓ నా జీవిత సహచరీ!
నీ చిర స్నేహానికి శిరసు వంచి నమస్కరిస్తున్నాను
నన్ను మనిషిగా దిద్ది నడిపించినందుకు
నీ గాయాలకు మనసుదీరా నమస్కరిస్తున్నాను.

-డా. చిల్లర భవానీదేవి

సంస్థ సోడిబ్యాన్ని నిలబెట్టిన తెర చిరిగింది. ఆమె భార్య కాదు; వొదినగారు కాదు. అనంత వ్యక్తిత్వంతో వుండిపోతున్న నరాలకువ్వ; అమరత కోసం అంతరాయాలని మంట గలిపిన సృష్టికర్త. అధరాలని అతని బుగ్గకి తగిల్చింది. రెప్పలు పైకి కదిలాయి. పక్క నుంచి మసక ప్రవాహంలా జారింది; ఇంద్రియాలలో రక్తం పిచ్చిగా తిరుగాడుతోంది.

"ఛీ, ఛీ! సిగరెట్టు కంపు;..."

అతని నోరు కప్పింది. పెనుగులాడాడు.

"కాంతం! మాకు అమరత నిచ్చేది ఉడుకులోన్ కాని అధరాలు కావు. అది లేకపోతే యీ పాపపు పెదాల వాసనలో పెట్రోల్, తారువేగం, గొడవ, హోరు, రొద, టి.బి. దుమ్ము- వొక్క క్షణం వుండలేను."

కాంతం శరీరంలోని మూలలు, వొంకర్లు, కోణాలు అన్నీ ముక్కలై, యీడగిలపడిపోయాయి. తను ఏదో ప్రాచీన ప్రపంచంలోకి వెళ్ళింది- అక్కడి నుంచి యీ దౌర్భాగ్యుడు కిందికి గెంటాడు. అతన్ని మంటలో పడేసి చర్మం వొలవాలనిపించింది; కోసి రక్తం తీసి గులాబీ మొక్కకి పొయ్యాలని వుంది. ("కొన్ని కొన్ని గులాబీలకి రక్తం పోస్తే కాని పుష్పించవు") పెనుగులాటలో ఓవల్టీన్ కప్పు కింద పడి పగిలింది.

"అయ్యో- సాయంత్రం బజార్లో మరోటి కొంటాం లెండి- మీ వారితో చెప్పొద్దు."

కాంతం కసితో చూసింది అతన్ని. ఆశాభవనం గాజు కుప్పలా కూలి ముక్కలైంది.

"మీ చెల్లెల్ని యివాళ తీసుకు వెళ్ళొచ్చునన్నారు. కారు సిద్ధంగా వుంటే యిప్పుడే వెళ్ళివొస్తా." అన్నాడు.

కాంతం చరచరా మెట్లు దిగి వెళ్ళింది. బైటకొచ్చింది. కారు డ్రైవరు ఎనమండుగురు పిల్లల్ని పోగుచేసి, 'చడుగుడి' ఆడిస్తున్నాడు. కారు సిద్ధం చెయ్యమని చెప్పింది. మరో కప్పుతో మళ్ళా పైకెళ్ళింది.

"ఏదో చప్పుడైందే?" అన్నాడు చంద్రకాంతం.

"నా చేతుల్లోనే అద్దం పడి పగిలింది." తను అద్దంలో మొహం చూసుకున్న విషయం చెప్పినందుకు పెదవి కొరుక్కుంది.

"ఫరవాలేదు. మావారి డబ్బంతా యింట్లో కప్పులకీ, అద్దాలకీ అవుతోంది."

"చాలా మంది మొగాళ్ళకంతేలెండి. కోతిని పెంచుకునేవాడు అది పగలగొట్టే అద్దాలకేనా ఖర్చు పెట్టొద్దా- అని వొకాయనన్నాడు లెండి."

ఈ వాక్యం వినిపించుకోకుండానే దిగి వెళ్ళిపోయింది కాంతం. హాస్పిటల్‌కి తనూ సిద్ధమైంది. కార్లో వెళ్ళారు. చంద్రకాంతం భార్యని కార్లో ఎక్కించుకుని సముద్రపు వొడ్డునే వొస్తుంటే బసవయ్య కనిపించాడు. అతనూ కార్లో ఎక్కాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. బసవయ్య మాత్రం కార్ల ఇన్స్యూరెన్సుని గురించి డ్రైవర్‌తో గుక్క తిప్పుకోకుండా లెక్చరిచ్చాడు.

"ఇదిగో- రేపు సముద్ర స్నానం చేద్దామా- చాలా కాలమైంది చేసి-?" అన్నాడు బసవయ్య.

"అమ్మో! నాకు భయం" అంది మరదలు.

"మీరొద్దు. మేం మొగాళ్ళం వెళ్తాం" ఎవళ్ళూ సమాధానం చెప్పలేదు. రాత్రి చాలాసేపు మాట్లాడింది సూర్యకాంతం భర్తతో.

☆☆☆

మొన్నాడు ఉదయం ఆరు గంటలకి నలుగురూ కారు మీద సముద్రపుటొడ్డుకి వెళ్ళారు. కారు దిగి దూరంగా యిసకలో ఫర్లాంగు దూరం నడిచి, చాప పరిచారు. తువ్వాళ్ళు, రెండు గొడుగులు తీసుకొచ్చి డ్రైవరు కారు దగ్గర కెళ్ళిపోయాడు. ఎర్రటి ముద్ద నీటి అంచు మీద లేచింది. మంచు నుండి విముక్తి పొందడానికి యిసుక కణాలు కాంతిలో విప్పారుకున్నాయి. ప్రకృతి తన అలంకారాన్ని అలజడిలోనూ, పక్షుల పిచ్చి పాటలతోనూ మ్రోగించుకుంటోంది.

బసవయ్య, చంద్రకాంతం నీళ్ళ దగ్గరకి నడిచిపొయ్యారు. కాంతం, చెల్లెలూ యిసుకలో దూదుంపుల్ల ఆడుకుంటున్నారు.

"నాకీతరాదు, నీకొచ్చునా?" అని అడిగాడు బసవయ్య.

"సముద్రంలో ఈతేం ప్రయోజనం? ఐనా నా జీవితానికి విలువలేదు. భీమా కూడా చెయ్యించలేదు."

బసవయ్య బిగ్గరగా నవ్వి చొక్కా తీసి నీళ్ళలోకి నడిచాడు. పదిహేను గజాలు వెళ్ళి మూడుసార్లు మునిగాడు.

"లోతులేదే- రా పరవాలేదు." చంద్రకాంతం దగ్గరగా వెళ్ళాడు. బసవయ్యని కెరటాలు కదల్చలేవు. చంద్రం కాళ్ళకి యిసక తగలడం లేదు. నీళ్ళల్లోకి చూస్తుంటే చిత్రమైన అనుభవం కలుగుతుంది. మంచుకరిగి కొండ శిఖరం విరిగి పడ్డట్టూ, పాదాల కింద భూమి వీడి ఎక్కడకో తీసుకెడుతున్నట్లూ లోకం గిరగిర తిరుగుతూ శూన్యత్వంలోకి గిరవాటెట్టినట్టూ భయమేస్తుంది. మానవుడి అల్పత్వం, అనావశ్యకత- అన్నీ తెలుస్తాయి సముద్రంలో మునిగిన వాడికి.

పెద్ద కెరటం చిన్న వాటిని నురుగుతో సహా లొంగ తీసుకొని ఇసిక గుహలను పెల్లగించి, వొడ్డున బ్రద్దలై, కిరీటం లాంటి నురుగుని చీర మాదిరి ఆరేసింది కాని, బసవయ్యని అంగుళం కదపలేదు. కాని అతనికి లోపలికి జారుతున్నట్లు అనుమానం తట్టింది. ఒడ్డు వెంపు నడిచాడు. శక్తిని పోగొట్టుకున్న పెద్ద కెరటం ఇసుకతో దొర్లుకుంటూ అతన్ని పది గజాలు తీసికెళ్ళింది. ఇంకా నడిచాడు.

"ఇక్కడ కూడా భూమి తగుల్తోంది..." అన్నాడు చంద్రకాంతం నురుగులా తేలిపోతూ.

కెరటాలు అల్పగంతులు, నాట్యం మానుకుని, పెద్ద పెద్ద నీటి ఆవరణాలను పూరించుకుని, లోలోపల భయంకరంగా కదులుతున్నాయి. పాము పడగలా నాలుకలు జాపుకుంటూ క్రూరంగా బసవయ్య దృష్టిని తారుమారు చేస్తూ తీసుకుపోతున్నాయి. అతను ప్రపంచానికి దూరమైపోతున్నాడు. నీళ్ళు తాగుతున్నాడు. చేతులను రెక్కలు విరిగిన పక్షిలా కొట్టుకుంటున్నాడు. ఒడ్డు కనిపించదు. మనుషులు కనిపించరు. ఆకాశం, సముద్రం అంతా వొకటే- తన నిర్మూలనానికి కలిసి పెనుగులాడుతున్నాయి.

"చం-ద్రం... దా-దా... అందు..." ఏవో ధ్వనులు చేశాడు. బాధలో వున్నవాడి మూగభాష- జీవం నిశీథంలో శ్మశాన వాటికలో అరిచే కడసారి అరుపు. చంద్రకాంతం వొచ్చి యితని దగ్గర పడ్డాడు. బసవయ్య జుట్టుని పళ్ళతో పట్టుకున్నాడు. చేతులతో అతని మెడ గట్టిగా బిగించి, అతని కళేబరాన్ని మీదేసుకుని వెల్లకిలబడి వూపిరి బిగించి, గుప్పిళ్ళతో నీటి కన్య స్తనాలపై కొడుతుంటే, వొక పోకిరి కెరటం విప్లవం చేసి బైటపడి, ఆ వ్యక్తులని వొడ్డుకేసి ఐదు గజాలు వూపి గిరవాటెట్టింది. భూమి తగిలింది. ఒడ్డున పడ్డాడు బసవయ్య. అతని పొట్టమీద అదుగేసి తొక్కాడు చంద్రకాంతం. శరీరాన్ని 'మాలీసు' చేశాడు.

సూర్యకాంతం దూరాన్నుంచి చూసి, గబగబ నడిచి చక్కా వొచ్చింది.

"ఏమీ లేదు- ఆయనకి అలుపొచ్చింది" అన్నాడు చంద్రకాంతం.

"అంతే కదా- ఏదో అని హడిలిపోయాను."

అతను తన భర్తని ఏమన్నా చేశాడేమోనని కాంతం భయపడింది. అసూయతో బాధపడుతున్న పురుషుడు ఎంత ప్రమాదమైనా చెయ్యగలడు. చంద్రకాంతం సముద్రంలో కొట్టుకుని పోతే ఎంత బాగుండును! ఏమిటి తనకీ ఆలోచనలు!

"చంద్రకాంతం లేకపోతే యీ పూట నా పని హుళక్కే" అన్నాడు బసవయ్య ఆయాసంతో.

అంతా యింటికి చేరుకున్నారు. ఆ సాయంత్రం వెడతానని చంద్రకాంతం భార్యని ప్రయాణం కట్టమన్నాడు. బసవయ్య బలవంతం మీద మొన్నాడు వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. రాత్రి భోజనానికి బసవయ్య కోసం కాచుకుంటూ చంద్రకాంతం హాల్లో కూర్చున్నాడు. అతని భార్య స్నానానికెళ్ళింది. తొట్టి స్నానం. గంటకి కాని రాదు. మల్లెపూలు కొప్పులో సర్దుకుంటూ కాంతం చక్కా వొచ్చింది.

"నువ్వు లేకపోతే మావారు కొట్టుకుపోదురటగా-"

ఒక బరువు ప్రయాణం

రాత్రిని మోస్తూ
రైలు
గుండెల్లో బాధల
పట్టాలను పరుచుకున్న
మనుషులు
వెనుకగా
పట్టాల మీద నాణెం
విశాలంగా

నీటిని చీలుస్తూ
పడవ
నీటి మాటల
మూటలను భుజాన మోస్తూ
మనుషులు
ఎదురుగా
సుడిగుండాలు
అల్లకల్లోలంగా

గాలిని బద్దలుకొడుతూ
విమానం
రెక్కలు కట్టుకుని
ఆకాశంలో ఎగిరిపోతున్నామంటున్న
మనుషులు
మధ్య వాతావరణం
వేడి సెగలై కాలుతూ

-పిఆర్ఎల్ స్వామి

"సర్లే- నే లేకపోతే ఆయన స్నానానికే వెళ్ళి వుండడు..."

"ఆ దయ నా మీదా, ఆయన మీదా?" అంటూ వీధి తలుపులు మూసింది.

"నాకెవళ్ళ మీదా దయాదాక్షిణ్యాలు లేవు. ఆయన బ్రతకడం వల్ల ఇన్‌స్యూరెన్సు ప్రపంచానికేనా వుపయోగం వుంది. నావల్ల ఏం ప్రయోజనం వుంది లోకానికి?"

"నాకుంది"

"అది నీ స్వార్థం. పైగా ఆయన కొట్టుకు పొయ్యాడంటే నీ పని ఏమౌతుందో తలుచుకుంటే భయమేస్తుంది. అంతేకాని నాకు త్యాగంలోనూ, పరోపకారంలోనూ నమ్మకం లేదు..."

కాంతంలో రేకెత్తిన ఆశాపుష్పం వాడింది.

"చంద్రం... నువ్వు కావాలి- వొక్క నిమిషం నన్ను నీ చేతుల్లో పట్టుకోవూ?"

"నువ్వు ఆట వస్తువ్వి కావు. స్త్రీవి. నాకుద్యోగం లేకపోవడం వల్ల కదా నాకీ పని కల్పించావు. లేదు. ఒదినగారూ, నాకు ప్రేమించేటందుకు తీరుబడిలేదు. ఆ విలాసం మీబోంట్లకు, ఉద్యోగం, ధనం, సంసారం; సంఘంలో స్థానం, పిల్లామేకా పోరూ పొందూ లేక హాయిగా కావలసినంత విశ్రాంతి వున్న మీకు అది తగిన కాలక్షేపం. భారతదేశంలో తిండిలేదు. నాగరిక ప్రపంచంలో ప్రేమలేదు. అందుకనే నవీన యువకుడికి శాంతిలేదు."

"ఈ దేశంలో నాగరికత లేదంటే నవ్వు వొస్తుంది. పోనీ నాకేనా లేదంటావా?" అని అడిగింది కాంతం.

"ఆకలి తీరని దేశానికి నాగరికతతో నిమిత్తం లేదు. నాకాకలి తీరలేదు. బాధగా వుందని లోకానికి దగ్గరగా చెప్పుకునే వాడు నాగరీకుడు కావొచ్చు. ఆకలి బాధ తగ్గింతర్వాత ధనవంతులు నాగరికతలో విలాసాలతో స్వేచ్ఛగా వ్యవహరిస్తారు. స్వేచ్ఛా జీవితం అవలంబిస్తేనే కాని నవీనులు కారేమోనన్న భయంవల్ల ధనవంతులు, ధనవంతుల భార్యలు నాగరికతని ఆచరణలో పెడతారు.

కాంతానికి ఒళ్ళు మండింది. భర్తతో చెప్పి యీ దౌర్భాగ్యుడ్ని సముద్రంలో ముంచలేకపొయ్యానన్న విచారం కలిగింది.

"చంద్రకాంతం, నేను నిన్ను పరిశోధించానే గాని నిజంగా నిన్ను ప్రేమించా ననుకున్నావా?"

"నన్ను నువ్వు నిజంగా ప్రేమించావని నమ్మేటంతటి శుంఠని కాను. పైగా యీ వేగంగా కదిలిపొయ్యే ఆర్థిక యంత్రం చక్రాల క్రింద ప్రేమ, సౌందర్యం, సత్యం- అన్నీ ముక్కలు ముక్కలై పొయ్యాయి. వాటిని అతికించాలంటే జిగురుబుడ్డి కొనేటంతటి డబ్బు కూడా లేదు నా దగ్గర. నీకది చేతకాదు."

ఇంతలో వీధి తలుపు చప్పుడైంది. అంత బిగ్గరగా తలుపు తట్టేది బసవయ్య తప్ప మరొకరు కారని కాంతానికి తెలుసు.

మొన్నాడు సాగనంపడానికి బసవయ్య, భార్యా కారులో స్టేషన్‌కి వెళ్ళారు. సూర్యకాంతం, చెల్లెలూ బండిలో కూర్చున్నారు. చంద్రకాంతం ఇంజన్ దగ్గర నిలబడి దాని పొగరుమోతు బలాన్ని పరీక్షిస్తూ నుంచున్నాడు. బసవయ్య గార్డుతో మాట్లాడుతున్నాడు- భీమా చెయ్యమని చంపుకు తింటూ.

"ఏమే-- మొన్న సముద్రంలో మీ బావ లేకపోతే నీ మొగుడు పని ఏం జరుగును..."

ఇంతలో బసవయ్య చక్కా వచ్చాడు.

"ఇదేమిటి, తలక్రిందులు చేసి చెబుతున్నావు? అతను లేకపోతే నేనేమౌదును?..."

మళ్ళా గార్డు సంజ్ఞ చేస్తే వెళ్ళిపొయ్యాడు. బండి కదిలే టైమయింది. చంద్రకాంతం పెట్టె దగ్గరకొచ్చాడు.

కాంతం బండిలోంచి దిగింది.

"ఇదుగో చూడూ" అన్నాడు చంద్రకాంతం, భార్యని సంబోధిస్తూ. "మీ బావతో యితర మొగాళ్ళను గురించి చెడ్డగా చెప్పొద్దని కొంచెం చెబుదూ."

"ఎవరితో" అంది అతని భార్య.

"అదే, మీ అక్కతో. కొంతమంది స్త్రీలకి చెడ్డ మొగాళ్ళంటే చాలా మోజు కాబోలు."

రైలు కదిలింది. బసవయ్య తన అరటి బొందులాంటి చేతిని వూపాడు.

ఇద్దరూ కార్లో యింటికొచ్చారు. కాంతం కార్లోంచి దిగి గబగబా తోటలోకొచ్చింది. చంద్రం పంపిన గులాబీ మొక్క మీద వో మొగ్గ లేచింది. కాంతం ఆ మొక్కని వేళ్లతో సహితంగా పెరికి, దూరంగా గోడకవతల గిరవాటెట్టింది. పాదంతో ఆ స్థలాన్ని చప్టాలా చేసింది. బసవయ్య ఆ పారేసిన మొక్కను చేత్తో తీసుకుని దొడ్డివేపు నుంచి చక్కావొచ్చాడు.

"ఇదేమిటి, యీ మొక్కని ఎవరు పారేశారే? పువ్వు కూడా పూసింది?"

"నేనే. దానికేదో అతనిలాగే జాడ్యం, మీరు చెప్పినవన్నీ నిజమే స్మండీ- అతను చాలా..."

"ఏమీ లేదు, చాలా మంచివాడు." అని బిగ్గరగా నవ్వుతూ ఆ మొక్కని మళ్ళా పాతటానికి సంకల్పించాడు.

"క్రాక్ అంటాను" అంది.

"క్రాక్ కావొచ్చు- కాని మంచివాడే." ●

మోనికా బుక్స్

తెలుగు వెలుగులు
75 మంది ప్రముఖుల
పదచిత్రాలు బాపు బొమ్మలతో
వెల: 85 రూపాయలు
తాజా ఎడిషన్

కొత్త కెరటాలు
ఆంధ్రజ్యోతి వీక్లీలో
1970లలో వెలువడిన
ప్రముఖులపై 71 వ్యాసాలు
వెల: 75 రూపాయలు

ఒక్కడు (చంద్రబాబు నాయుడి సమగ్ర జీవితకథ)
తాజా విడుదల
వెల: 125 రూపాయలు

ఒకే ఒక్కడు
ఎన్.టి.ఆర్. జీవితకథ
వెల: 150 రూపాయలు
తాజా ఎడిషన్!

విశ్వ విహారం
యాత్రారచన
వెల: 60 రూపాయలు

కథాపత్రిక
ఎంపిక చేసిన
20 కథల సంపుటి
వెల: 60 రూపాయలు

ఐ.వి.ఆర్.-రాజసూయం
ఉలుకు-పలుకు
వ్యాసాల సంకలనం
వెల: 75 రూపాయలు

యీ పుస్తకాలు విశాలాంధ్ర బుక్ హౌస్‌తో సహా ప్రముఖ పుస్తకాల షాపులన్నిటిలో లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం వెలను ఎం.ఓ. లేదా డి.డి. ద్వారా పంపండి. పోస్టేజి ఉచితం.

మోనికా బుక్స్
ప్లాట్ నెం. 103, రోడ్ నెం. 71, నవనిర్మాణ్ నగర్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033.